# సామాన్యుడికి ధరల షాక్

**కొండెక్కిన నిత్యావసరాలు • బియ్యం, పప్పు, ఉప్పుల దగ్గర్నుంచి అన్నీ పిరం**

**భగ్గుమంటున్న కూరగాయల ధరలు • 17 శాతం పెరిగిన ఆహారోత్పత్తుల రేట్లు**

**సబ్బులు, హెయిర్ ఆయిల్స్ 11 శాతం ప్రియం • సూది గోలీలు చూస్తేనే గుండె దడ**

**పేద, మధ్యతరగతి నెత్తిన పెను భారం • ఇక మొదలుకానున్న పెట్రో వడ్డనలు**

మోహన్‌రావు ఓ ప్రైవేట్ ఉద్యోగి. ఇంటికి దూరపు బంధువు ఒకరు వస్తే.. మార్కెట్‌లో చికెన్ తెద్దామని వెళ్లాడు. కిలో రూ.280 ఉన్నది. దాంతో చేసేదేమీలేక రూ.80 పెట్టి డజను కోడిగుడ్లు తీసుకుని వెళ్లిపోయాడు. సావిత్రమ్మ ఓ గృహిణి. అంగట్లో కూరగాయలు కొనేందుకు వెళ్లింది. కిలో టమాట రూ.100 పలుకుతున్నది. ఉల్లిగడ్డ రూ.50 అంటున్నారు. పచ్చి మిర్చి రూ.80 చెప్తున్నారు. బెండ, దొండ, వంకాయ.. ఇలా ఏది అడిగినా పావు రూ.20 కంటే తక్కువ లేవు. ఇక పరందామయ్య వయసు 70. నిత్యం షుగర్, బీపీ ట్యాబ్లెట్లు మింగాల్సిందే. మందు బిళ్లలు అయిపోతే మెడికల్ షాపులో ఎప్పుడూ ఇచ్చేంత ఇచ్చినా ఇంకా కావాలంటున్నారు. అదేంటని అడిగితే రేట్లు పెరిగాయన్న సమాధానం. కిరాణా సరకుల కోసం వెళ్లిన కిశోర్, పండ్లు తెచ్చేందుకు పోయిన రవీందర్‌లదీ ఇంతే సంగతి.




న్యూఢిల్లీ, జూన్ 30: ఏం తినేటట్టు లేదు.. ఏం కొనేటట్టు లేదు. అవును.. కొనడానికి పోతే కొరివితో తలగోక్కున్నట్టే అనేలా తయారైంది పరిస్థితి. కిరాణా సరకుల దగ్గర్నుంచి కూరగాయలు, పండ్లదాకా అన్నింటి రేట్లూ మోత మోగిస్తున్నాయి. చివరకు అత్యవసర ఔషధాలనూ కొనుక్కోలేని దుస్థితి దాపురించింది. ఒక్కమాటలో చెప్పాలంటే సామాన్యుల ఇంటి బడ్జెట్ తలకిందులైపోయింది. అసలే మార్కెట్ మందగమనంలో ఉన్న వేళ.. ద్రవ్యోల్బణం విజృంభిస్తుండటంపట్ల అన్ని వర్గాల్లోనూ ఆందోళన కనిపిస్తున్నదిప్పుడు. ముఖ్యంగా ఆహార ద్రవ్యోల్బణం పెచ్చుమీరకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని సర్వత్రా డిమాండ్లు వినిపిస్తున్నాయి.

### ఎఫ్ఎంసీజీ ఎఫెక్ట్

ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) కంపెనీలు తాము తయారు చేస్తున్న దాదాపు అన్ని ఉత్పత్తుల రేట్లనూ పెంచేశాయి. సబ్బులు, హెయిర్ ఆయిల్స్‌తోపాటు వివిధ ఆహారోత్పత్తుల ధరలు గడిచిన 2-3 నెలల్లో 2 నుంచి 17 శాతం వరకు పెరిగాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వేళ కంపెనీలు ధరలు పెంచడం చర్చనీయాంశమైంది. 2022తోపాటు 2023 ప్రథమార్ధం వరకు ఎఫ్ఎంసీజీ సంస్థలు ధరలు పెంచాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు, పామాయిల్ ధరలు తగ్గుముఖం పట్టినా.. వాటి ఆధారిత ఉత్పత్తుల ధరలు పెరగడం గమనార్హం. కాగా, చాలా సంస్థలు తమ ఉత్పత్తుల ధరలను పెంచకుండా, వాటి పరిమాణాన్ని తగ్గిస్తున్నాయి. దీంతో వినియోగదారులకు తెలియకుండానే వారిపై ధరల భారాన్ని కార్పొరేట్ కంపెనీలు మోపుతున్నాయి.

### ఇది ఆరంభమే..

ఏప్రిల్‌లో హెయిర్ ఆయిల్ ధరలను 6 శాతం పెంచామని, కొబ్బరి రేట్లు పెరుగుతున్నందున మళ్లీ పెరిగేందుకు వీలున్నదని ఇటీవలి త్రైమాసిక ఆర్థిక ఫలితాల సందర్భంగా ఎఫ్ఎంసీజీ దిగ్గజం మారికో సంకేతాలిచ్చింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో తమ ఉత్పత్తుల ధరలను 2 నుంచి 4 శాతం పెంచబోతున్నట్టు స్నాక్స్ తయారీదారు బైకాజీ తెలిపింది. ఉత్పాదక వ్యయం పెరిగిందంటూ డాబర్, ఇమామీ సంస్థలు కూడా తమ ఉత్పత్తుల రేట్లు కొంతమేర పెరుగుతాయంటున్నాయి.

### ఔషధాలూ పిరం

ప్రజలకు అత్యవసరమైన ఔషధాల ధరలను నియంత్రించడంలోనూ మోదీ సర్కారు విఫలమవుతున్నది. ఏకంగా 800 కీలక ఔషధాల ధరల్లో పెంపు.. ఇప్పుడు దేశంలోని మెజారిటీ ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నది. ఇప్పటికే రక్తపోటు (బీపీ), చక్కెర వ్యాధి (డయాబెటిస్ లేదా షుగర్)తో బాధపడుతున్నవారు ఎక్కువ సొమ్ము పెట్టి మందులను కొనుక్కోవాల్సి వస్తున్నది. గడిచిన రెండు నెలలుగా క్రమేణా ఆయా మందుల ధరలు పెరుగుతూనే ఉన్నాయని, ఇలా ఇప్పటిదాకా 15 శాతం పెరిగాయని మెడికల్ షాపు యాజమాన్యాలు చెప్తున్నాయి. పెయిన్ కిల్లర్స్, యాంటీ బయాటిక్స్, యాంటీ ఇన్ఫెక్టివ్స్ వంటి ఔషధాల ధరలకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో రెక్కలొచ్చాయి. అంతేగాక సర్కారు తీరు ఔషధ తయారీ సంస్థలకు లాభాల్ని పంచిపెడుతున్నది. ఏటా కొంతమేర పెంచేందుకు డ్రగ్స్ కంపెనీలకు కేంద్రం పచ్చ జెండా ఊపింది. అయినప్పటికీ షెడ్యూల్ ఫార్ములేషన్లపై 10 శాతం, నాన్-షెడ్యూల్ డ్రగ్స్‌పై 20 శాతం మేర ధరల్ని పెంచుకుంటామని ఫార్మా కంపెనీల లాబీయింగ్ గ్రూప్ పావులు కదుపుతుండటం గమనార్హం. నిజానికి గతంలోనే 10-12 శాతం వరకు రేట్లను పెంచాయి.

### ద్రవ్యోల్బణం ఒత్తిళ్లు

రిటైల్, టోకు ద్రవ్యోల్బణం గణాంకాలు ఇప్పటికీ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ఆమోదయోగ్య స్థాయిలో నమోదు కావడం లేదు. మే నెలకుగాను ఇటీవల కేంద్రం విడుదల చేసిన లెక్కలనే చూస్తే.. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 4.8 శాతంగా ఉన్నది. ఇక టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత హోల్‌సేల్ ద్రవ్యోల్బణం 15 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 2.61 శాతానికి ఎగబాకింది. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతం దిగువనే ఉంచాలన్నది ఆర్బీఐ లక్ష్యం. అందుకే ఇటీవలి ద్రవ్యసమీక్షల్లోనూ కీలక వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయిల్లోనే ఉంచింది. ఇది ఇతర రంగాల రుణ లభ్యతను దెబ్బతీస్తున్నది. రుణగ్రహీతలపై ఈఎంఐల భారాన్నీ పెంచుతున్నది. అయితే వర్షాధార పంటలే ఎక్కువగా ఉన్న భారత్‌లో.. కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టేదాకా పరిస్థితి ఇలాగే ఉంటుందన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయిప్పుడు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం, వ్యవసాయాన్ని, రైతులను చిన్నచూపు చూడటం మోదీ సర్కారు ఇకనైనా మానుకోవాలని మెజారిటీ విశ్లేషకులు హితవు పలుకుతున్నారు. ఇక సరైన గిడ్డంగుల వ్యవస్థ ఉంటే.. మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గ సరకులు లభిస్తాయని ఆర్థిక, వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

### త్వరలో పెట్రో వడ్డనలు!

పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయా రాష్ర్టాల అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇన్నాళ్లూ పెట్రో ధరల పెంపును అడ్డుకున్న కేంద్రం.. ఇప్పుడు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలకు పెంపుపై స్వేచ్ఛనివ్వబోతున్నట్టు సమాచారం. ఇక రవాణా చార్జీల భారం ఆయా వస్తూత్పత్తులపై తప్పక ఉంటుంది. దీంతో రిటైల్ మార్కెట్‌లో వాటి ధరలు ఇంకా పెరగడం సహజమే.

### ధరలెందుకు పెరుగుతున్నాయ్?

దేశంలో ధరలు ఇంతలా పెరుగుతుండటం వెనుక డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడమే కారణమని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నిజానికి నైరుతీ రుతుపవనాలు ఈసారి ముందుగా వచ్చినా.. ఆశించిన స్థాయిలో మాత్రం వర్షపాతం లేదు. పంటలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. ఇంకా ఉష్ణోగ్రతలు అత్యధిక స్థాయిల్లోనే నమోదవుతున్నాయి. దీంతో ఇప్పట్లో పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, కూరగాయల ధరలు తగ్గకపోవచ్చనే మెజారిటీ విశ్లేషకులు చెప్తున్నారు. ఇక పండిన పంటలను నిల్వ చేసుకోవడంలోనూ ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని.. ఉల్లి, టమాట, పాలకూర, వంకాయ ఇలా అన్ని కూరగాయల ధరలకు రెక్కలు తొడగడానికి కారణం ఇదేనన్న విమర్శలు ఇప్పుడు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. మరోవైపు గోధుమల సరఫరా మార్కెట్‌లోకి తగ్గిపోతున్నది. అయినా దిగుమతులపై కేంద్రం ఇంకా ఓ నిర్ణయానికి రాకపోవడం కూడా ధరల పెంపునకు దారితీస్తున్నట్టు చెప్తున్నారు. వరి, చెరకు పంటలు దెబ్బతిని.. బియ్యం, చక్కెర రేట్లను పరుగులు పెట్టిస్తున్నాయి.

### ప్రభుత్వం ఏం చేయాలి?

- ఎగుమతులపై నిషేధం, దిగుమతులపై సుంకాల ఎత్తివేతతో కొన్ని ఆహారోత్పత్తుల ధరలను అదుపు చేయవచ్చు.
- చక్కెర, బియ్యం, ఉల్లిగడ్డ, గోధుమల ఎగుమతుల్ని ఆపి ధరల్ని నియంత్రించవచ్చు.
- ప్రభుత్వమే వివిధ పప్పుధాన్యాలను కొని సబ్సిడీ ధరలకు రేషన్ షాపులు, ఇతరత్రా మార్గాల ద్వారా ప్రజలకు అందేలా చేయవచ్చు. మార్కెట్‌లో కృత్రిమ కొరతను సృష్టిస్తున్నవారిపై కొరడా ఝుళిపించి అక్రమ నిల్వలను బయటికి తీయాలి.
- రైతులే నేరుగా తమ పంటలను అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలి.

చివరగా.. తాజాగా కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీకి.. తమకు ఆదరణ తగ్గలేదని నిరూపించుకోవడానికి త్వరలో జరిగే మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలు కీలకం కానున్నాయి. అందుకే అక్కడి రైతుల మద్దతును సంపాదించుకొనేందుకు మోదీ సర్కారు విశ్వ ప్రయత్నాలనే చేస్తుంది. దీంతో ధరలను అడ్డుకుని వారి ఆగ్రహానికి గురయ్యే సాహసం కమలం పార్టీ పెద్దలు చేయకపోవచ్చనే విశ్లేషణలున్నాయి. ఇంకొన్నాళ్లు ఓపిక పట్టి ఆ తర్వాతే ఏదో ఒకటి చేద్దామన్న ధోరణితో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్టు చెప్తున్నారు. మొత్తానికి ధరల అదుపు ఇప్పట్లో జరగదనేదే సారాంశం.

### మార్కెట్‌లో ధరలు ఇవీ..

| వస్తువు (కిలో) | ధర (రూ.లలో) | పెరుగుదల (రూ.లలో) |
|---|---|---|
| కందిపప్పు | 180 | 40 |
| మినపపప్పు | 140 | 30 |
| పెసరపప్పు | 130 | 45 |
| శనగపప్పు | 100 | 35 |
| పాలు (లీటర్) | 60 | 4 |
| పెరుగు | 96 | 28 |
| చికెన్ | 280 | 70 |
| గుడ్లు (డజను) | 80 | 25 |
| టమాటా | 90 | 60 |
| ఉల్లిగడ్డ | 50 | 30 |
| పచ్చిమిర్చి | 80 | 40 |
| బెండ/దొండ | 70 | 30 |
| దానిమ్మ | 350 | 120 |
| యాపిల్ | 260 | 50 |
| ఆరెంజ్ (1) | 40 | 15 |
| బొప్పాయి | 45 | 15 |



పండ్లు, కూరగాయల ధరలు హోల్‌సేల్ మార్కెట్‌లోనే బాగా పెరిగిపోయాయి. దీంతో రిటైల్ ధరలు ఇంకా ఎక్కువైపోయాయి. ఇప్పటికే వ్యాపారం తగ్గిపోయింది. ఎప్పుడూ కిల్లోల్లో కొనే కస్టమర్లు కూడా ఇప్పుడు అర్ధ, పావుకిలోతో సరిపెట్టుకుంటున్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే కష్టాలమే.

**-పండరీనాథ్, పండ్లు, కూరగాయల వ్యాపారి**



పప్పులు, సబ్బులు, టూత్ పేస్టులు.. అన్ని కిరాణా సరకుల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ధరలు ఇలా పెరుగుతూపోతే వినియోగదారులకే కాదు.. వ్యాపారులకూ ఇబ్బందే. బిజినెస్ పడిపోవడం వల్ల పెట్టిన పెట్టుబడులు రావడం లేదు. ఈఎంఐల చెల్లింపులూ ఇబ్బందికరంగా మారుతున్నాయి.

**-రాజు, కిరాణా వ్యాపారి**



ఈ ఏడాది కోళ్ల ధరలు గణనీయంగా పెరిగాయి. దీంతో చికెన్ రేట్లూ అదే స్థాయిలో కదలాడుతున్నాయి. కిలో రూ.300 దరిదాపుల్లో ఉండటం.. వ్యాపారాన్ని దెబ్బతీస్తున్నది. డజను కోడిగుడ్లు సైతం రూ.70-80కి అమ్ముతున్నాం. ఫామ్ స్థాయిలో పెరిగిన ఖర్చులు రిటైల్ మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి.

**-సురేశ్, చికెన్ షాపు యజమాని**



మందుల రేట్లు పెరుగుతున్నాయి. ప్రధానంగా బీపీ, షుగర్ ఔషధాల ధరలు ఇటీవలికాలంలో బాగా పెరిగిపోయాయి. గడిచిన రెండు నెలల్లో ఏకంగా 15 శాతం వరకు ఎగిశాయి. మా రెగ్యులర్ కస్టమర్లకూ ఇబ్బంది కలుగుతున్నది. నెలనెలా ఇలా రేట్లు పెరగడమేంటి? అంటూ అంతా విస్తుపోతున్నారు.

**-సాయి, మెడికల్ షాపు యజమాని**



ప్రతి నెలా ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఆదాయం మాత్రం అంతంతే ఉంటున్నది. ఇలాగైతే ఏం పెట్టి కొనేది.. ఎలా తినేది. రెండు నెలల క్రితం రూ.500కు వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు రూ.700-800 పెట్టాల్సి వస్తున్నది. కిరాణా సరుకుల నెలవారీ బడ్జెట్ కూడా పెరిగిపోయింది.

**-స్రవంతి, గృహిణి**

---



ట్రీ మ్యాన్ ఆఫ్ తెలంగాణ అవార్డును అందుకొంటున్న సింగరేణి సీఎండీ ఎస్ బలరామ్

## సింగరేణి సీఎండీకి 'ట్రీ మ్యాన్' అవార్డు

**గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ ప్రదానం**

హైదరాబాద్,జూన్ 30 (నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరామ్‌కు 'ట్రీ మాన్ ఆఫ్ తెలంగాణ' అవార్డు లభించింది. సింగరేణిని పర్యావరణ అనుకూల సంస్థగా మార్చడంతోపాటు స్వయంగా 18 వేలకుపైగా మొక్కలను నాటి ప్రజల్లో పర్యావరణ స్ఫూర్తిని పెంచినందుకు, తెలంగాణలోని 6 జిల్లాల్లో 35 చిన్న అడవులను (మినీఫారెస్ట్స్) సృష్టించినందుకు ఈ అవార్డు వరించింది. శనివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేసింది. వక్తలు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు బలరామ్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు సింగరేణి పలు కార్యక్రమాలను చేపడుతున్నదని, సింగరేణి బడుల్లో పిల్లలకు పర్యావరణ సిలబస్‌ను బోధిస్తున్నామని బలరామ్ వివరించారు. ఈ నేపథ్యంలో సీఎంపీడీఐ 2021-22లో తమ సంస్థను 'కార్బన్ న్యూట్రాలిటీ కంపెనీ'గా గుర్తించిందని తెలిపారు. ఈ ఏడాది 40 లక్షల మొక్కలను నా టేందుకు సింగరేణి సిద్ధమైందని, వనమహోత్సవంలో భాగంగా 2 వేల మొక్కలను నాటాలని వ్యక్తిగత లక్ష్యంగా పెట్టుకున్నానని వెల్లడించారు. గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఎండీ అశుతోష్ వర్మ, ఎన్టీపీసీ, ఆయిల్ ఇండియా తదితర కంపెనీల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పట్టుకొచ్చి లోపలేయాలా?

- **గోల్డ్‌స్మిత్ పరారీ కేసులో బాధితులకు బెదిరింపులు**
- **తీసుకున్న బంగారం తెచ్చి ఇవ్వాలని పోలీస్ అధికారి హుకుం**
- **భయాందోళనలో బాధితులు**
- **వరంగల్ సీపీ పరిధిలో వెలుగులోకి..**

సుబేదారి, జూన్ 30 : న్యాయం చేయాలని ఠాణా మెట్లు ఎక్కిన బాధితులకే చుక్కలు చూపిస్తున్నాడో పోలీస్ అధికారి. 'చెప్పినట్టు వింటారా? లేకపోతే పట్టుకొచ్చి లోపలేయాలా?' అంటూ బెదిరింపులకు పాల్పడుతుండటంతో బాధితులు గజగజ వణికిపోతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్ నగరం సెంట్రల్ జోన్‌లో ఓ ఇన్‌స్పెక్టర్.. తన స్టేషన్ పరిధిలో స్వర్ణకారుడు ఆభరణాల తయారీ కోసం తన వినియోగదారుల నుంచి పెద్దమొత్తంలో బంగారం తీసుకున్నాడు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన ఓ బాధితుడికి ఆ స్వర్ణకారుడు చాలాకాలం నుంచి పరిచయం ఉండటంతో కొద్దిరోజుల క్రితం రూ.7 లక్షలకుపైగా విలువ చేసే 85 గ్రాముల బిస్కెట్ గోల్డ్‌కాయిన్ ఇచ్చి రసీదు తీసుకున్నాడు. అయితే ఏం జరిగిందో ఏమో కానీ, ఇటీవల ఆ స్వర్ణకారుడు బాధితుల నుంచి తీసుకున్న బంగారంతో పరారయ్యాడు. విషయం తెలిసిన బాధితులు అతడి షాపు వద్దకు వెళ్లి సిబ్బందిని నిలదీశారు. కమలాపూర్‌కు చెందిన బాధితుడు కూడా వెళ్లి సిబ్బందిని నిలదీయగా పాత పరిచయంతో స్వర్ణకారుడి వద్ద పనిచేసే సిబ్బంది 50 గ్రాముల బంగారం అతడికి ఇచ్చారు. అదే సమయంలో మరికొందరు తమకు న్యాయం చేయాలని స్థానిక ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో స్వర్ణకారుడి అసలు బాగోతం బయటపడింది. పరారైన స్వర్ణకారుడి వద్ద పనిచేసే సిబ్బందిని విచారణ కోసం ఇన్‌స్పెక్టర్ స్టేషన్‌కు పిలిపించినట్టు తెలిసింది. ఎంతమంది వద్ద ఎంతెంత బంగారం తీసుకున్నారు? ఎవరెవరికి ఇచ్చారు? అని వివరాలు తీసుకొన్నాడు. బంగారం తిరిగి తీసుకున్న బాధితులకు ఫోన్ చేసి 'మీరు తీసుకున్న బంగారం తిరిగి ఇవ్వాలి' అని ఫోన్ చేసి హుకూం జారీ చేసినట్టు తెలిసింది. కమలాపూర్‌కు చెందిన బాధితుడికి ఇన్‌స్పెక్టర్ ఫోన్‌చేసి తీసుకున్న 50 గ్రాముల బంగారం స్టేషన్‌కు తీసుకొచ్చి ఇవ్వాలని బెదిరించాడు. 'నేను ఇచ్చిన 85 గ్రాముల బంగారంలో వచ్చింది 50 గ్రాములే. ఇంకా 35 గ్రాముల బంగారం రావాలి. రసీదు, ఫోన్ కాల్స్ రికార్డ్స్ ఉన్నాయి'.. సార్ అని సదరు బాధితుడు మొరపెట్టుకున్నా ఆ ఇన్‌స్పెక్టర్ వినలేదని తెలిసింది. 'స్టేషన్‌కు వస్తావా? రావా?.. రాకుంటే పట్టుకొచ్చి లోపలేస్తా'.. అని బెదిరింపులకు దిగినట్టు సమాచారం. దీంతో బాధితుడు భయాందోళనకు గురవుతున్నట్టు తెలిసింది.

## గూడూరులో అరుదైన జైన పద్మావతి శిల్పాలు

పాలకుర్తి, జూన్ 30 : మనకు కనిపించే నాగదేవతల విగ్రహాలన్నీ ఒకటి కాదని, అందులో జైన యక్షిణి పద్మావతిదేవి శిల్పాలు ఉంటాయని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో రెండు అరుదైన రాష్ట్ర కూటుల కాలం నాటి జైన యక్షిణి శిల్పాలను ఆయన గుర్తించారు. ఆదివారం వాటి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు శిల్పాల్లో ఒకటి.. గ్రామంలోని పోచమ్మ గుడి చెట్టు కింద కొమటోళ్ల బొమ్మలు అని స్థానికులు పిలిచే శిల్పాల్లో ఉన్నదని, దానిలో శిల్పకళ ఉట్టి పడుతున్నదని తెలిపారు. నడుము నుంచి పైభాగం వరకు మానవ స్త్రీ రూపం, దిగువ భాగం మెలితిరిగిన పాము తోకతో ఉన్నట్టు తెలిపారు. నల్లని పొడవైన గ్రానైట్ శిలపై నర నాగ దేవత రూపంలో ఉన్నట్టు చెప్పారు. తల పై 9 పడగల సర్పం గొడుగు పట్టిందని, రెండు చేతుల్లో రెండు తామర మొగ్గలు ఉన్నాయని చెప్పారు. జైన దేవతల విగ్రహాలను చెట్టుకు ఒరిగించి పెట్టారని ఆయన తెలిపారు. ఈ రెండు శిల్పాలను గ్రామస్థులు సంరక్షించుకోవాలని కోరారు.



జనగామ జిల్లా గూడూరులో జైనయక్షిణి పద్మావతి శిల్పాలు



**బొగతకు పర్యాటకుల తాకిడి**

ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి అటవీప్రాంతంలో ఉన్న తెలంగాణ నయాగార బొగత జలపాతం ఆదివారం పర్యాటకులతో నిండిపోయింది. ఇక్కడికి రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. జలపాతం వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ సందడి చేశారు. వ్యూపాయింట్ వద్ద కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ బొగత అందాలను కెమెరాలు, సెల్‌ఫోన్లలో బంధించుకున్నారు. - వాజేడు

## మేడిగడ్డలో పెరిగిన వరద ప్రవాహం

మహదేవపూర్, జూన్ 30 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామంలోని లక్ష్మి (మేడిగడ్డ) బరాజ్‌కు వరద ప్రవాహం పెరుగుతున్నది. శనివారం ఇన్‌ఫ్లో 12 వేల క్యూసెక్కులు ఉండగా, ఆదివారం 12,500 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో బరాజ్‌లోని 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నదని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. భారీ వరద ప్రవాహం కారణంగా పలు పరిశోధనలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. డౌన్ స్ట్రీమ్‌లో పియర్ల వద్ద ఉన్న ఇసుక కొట్టుకుపోకుండా ఏర్పాటు చేసిన రాళ్లను సరిచేస్తున్నారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మోస్తరు వాన

- **ఖమ్మంలో 32, దుమ్ముగూడెంలో 39 మి.మీ. వర్షపాతం**
- **ములకలపల్లిలో పొంగిన పాములేరు వాగు**
- **ఆరు గ్రామాలకు నిలిచిన రాకపోకలు**

భద్రాద్రి కొత్తగూడెం, (నమస్తే తెలంగాణ)/ ఖమ్మం వ్యవసాయం/అశ్వారావుపేట/ ములకలపల్లి, జూన్ 30: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శనివారం ప్రారంభమైన వాన ఆదివారం రాత్రి దాటినా ధార తెగకుండా కురుస్తూనే ఉంది. కొన్ని మండలాల్లో తేలికపాటి, మరికొన్ని మండలాల్లో మోస్తరు, ఇంకొన్ని మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సగటున 32 మిల్లీ మీటర్ల వర్షపాతం, భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో 39 డిగ్రీల వర్షపాతం నమోదైంది. ఈ వర్షంతో పత్తి, పునాస పంటలు ప్రాణం పోసుకుంటున్నాయి. మండల, పట్టణ, జిల్లా కేంద్రాల్లో జనజీవనానికి కాస్త ఆటంకం ఏర్పడింది. ఆయా పనుల మీద బయటకు వెళ్లాల్సిన వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఖమ్మం జిల్లా వైరా మండలం రెబ్బవరంలో ఆదివారం ఉదయం భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలింది. వైరా-జగ్గయ్యపేట మార్గంలో కిలోమీటర్ల మేర వందలాది వాహనాలు నిలిచిపోయాయి.



వర్షం కారణంగా ఖమ్మం జిల్లా వైరా మండలం రెబ్బవరం వద్ద రహదారిపై కూలిన చెట్టు

### కొట్టుకుపోయిన అప్రోజ్ నిర్మాణం

ములకలపల్లి మండలం తాళ్లపాయి పంచాయతీ పరిధిలో రింగిరెడ్డిపల్లి మీదుగా భద్రాచలం వెళ్లే ప్రధాన రోడ్డుపై పాములేరు వాగు మీద వంతెన నిర్మాణానికి అధికారులు సిద్ధమయ్యారు. అప్పటికే ఉన్న బ్రిడ్జిని కాంట్రాక్టర్ తొలిగించి రాకపోకలకు అంతరాయం కలుగకుండా తాత్కాలికంగా అప్రోచ్ నిర్మించారు. ఇటీవల ములకలపల్లిలో కురిసిన వర్షానికి అప్రోచ్ కొట్టుకుపోయింది. దీంతో రింగిరెడ్డిపల్లి, తాళ్లపాయి, మంగళిగుట్ట, సుందర్‌నగర్ గ్రామాలకు రవాణా వ్యవస్థ స్తంభించింది.

## భూపరిహారం పంపిణీలో అక్రమాలు

- **అక్రమార్కుల కుటుంబ సభ్యుల ఖాతాల్లో డబ్బు జమ**
- **ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన.. ఫిర్యాదులతో విచారణ**
- **ఏసీబీ అదుపులో వరంగల్ ఆర్డీవో సిడాం దత్తు**

వరంగల్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): భూపరిహారం పంపిణీలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు వరంగల్ రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీవో) సిడాం దత్తును అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జరిగిన ఈ అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో ఏసీబీ అధికారులు దత్తును వరంగల్ ఆర్డీవో కార్యాలయం నుంచి తీసుకెళ్లడం రెవెన్యూ శాఖలో చర్చనీయాంశమైంది. సిడాం దత్తు ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ముందు బదిలీపై వరంగల్ ఆర్డీవోగా వచ్చారు. గతంలో ఆసిఫాబాద్ ఆర్డీవోగా పనిచేశారు. ఆ సమయంలో ఆసిఫాబాద్ పట్టణాన్ని ఆనుకొని ఉన్న జన్కాపూర్ శివారు మీదుగా 363 జాతీయ రహదారి నిర్మాణం జరిగింది. జన్కాపూర్ శివారులో అప్పటికే రెండు సర్వేనంబర్లలోని భూమిలో సుమారు 15 ఎకరాల్లో వెంచర్లు చేశారు. ఆ లేఅవుట్లకు సంబంధించిన 6.12 ఎకరాలను 363 జాతీయ రహదారి నిర్మాణానికి సేకరించినట్టు రెవెన్యూ అధికారులు రికార్డుల్లో పేర్కొన్నారు. ఈ భూమికి పరిహారంగా ప్రభుత్వం నుంచి రూ.4.32 కోట్లు మంజూరయ్యాయి. సదరు వెంచర్‌లో రహదారుల నిర్మాణం కోసం వదిలిన స్థలాలకు మంజూరైన పరిహారాన్ని స్థానిక గ్రామపంచాయతీకి ఇవ్వా ల్సి ఉండగా.. ఈ వెంచర్ చేసిన స్థిరాస్తి వ్యాపారులు అక్రమంగా తీసుకున్నారు. దీనిపై ఫిర్యా దు అందడంతో ప్రభుత్వం విచారణ చేపట్టిం ది. స్థిరాస్తి వ్యాపారుల్లో ఒకరి వద్ద పనిచేసిన డ్రైవర్ బ్యాం కు ఖాతాలో రూ.1,15,19,000 జమ అయ్యాయి. అందు లో నుంచి ఆర్డీవో సిడాం దత్తు తల్లి సిడాం మల్కుబాయి ఖాతాలోకి రూ.65 లక్షలు, డిప్యూటీ తహసీల్దార్ మేస్రం నాగోరావు సోదరుడు మేస్రం చత్రుషా ఖాతా లో రూ.30 లక్షలు బదిలీ అయినట్టు విచారణలో తేలింది. సర్వేయర్ భరత్‌కు రూ.10 లక్షల నగదుతోపాటు రూ.2 లక్షల విలువైన బైకును స్థిరాస్తి వ్యాపారులు కొనుగోలు చేసి ఇచ్చారని వెలుగులోకి వచ్చింది. నిందితుల బ్యాంకు స్టేట్‌మెంట్లు, స్థిరాస్తి వ్యాపారి డ్రైవర్ వాంగ్మూలాన్ని విచారణ అధికారులు నమోదు చేశారు.

## మరో మూడు రోజులు భారీ వర్షాలు

- **బంగాళాఖాతంలో అల్పపీడనం**
- **జూన్ నెలలో సాధారణ వర్షపాతానికి మించి నమోదు**

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 7.6 కి.మీ ఎత్తులో నైరుతి దిశగా కొనసాగుతుందని పేర్కొన్నది. అల్పపీడనం, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలుగు రాష్ర్టాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. మరో మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆదివారం భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ముల్కపల్లేలో అత్యధికంగా 9.12 సెం.మీ, భద్రాచలంలో 7.33 సెం.మీ, జూలూరుపాడ్‌లో 6.26 సెం.మీ, చంద్రుగొండలో 6.15 సెం.మీ, కొత్తగూడెంలో 5.57 సెం.మీ, చుంచుపల్లిలో 5.32 సెం.మీ, అశ్వాపురంలో 5.51 సెం.మీ, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో 5.74 సెం.మీ, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో 5.61 సెం.మీ, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో 6.72 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది జూన్ ముగిసేటప్పటికీ 159 మి.మీ. వర్షపాతం నమోదైంది. సోమవారం ఆదిలాబాద్, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, మహబూబాబాద్, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.